క్లుప్తంగా

పెంపుడు కుక్కలను రోడ్లపైకి రానివ్వొద్దు

ఖానాపూర్: పట్టణ పరిధిలో పెంపుడు కుక్కలు రోడ్లపైకి రాకుండా యజమానులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రత్నాకర్ రావు కోరారు. ఆదివారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెంపుడు కుక్కలకు విధిగా టీకాలు వేయించడంతో పాటు వాటిని ఇంటి ఆవరణలో గొలుసులతో కట్టేయాలన్నారు. పెంపుడు కుక్కలు ప్రజలపై దాడులు చేస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో కోతుల బెడదతో పాటు ఊరకుక్కల బెడదను నిర్మూలించేందుకు ఈనెల 16న మున్సిపల్ పాలకవర్గంతో సమావేశం నిర్వహించామన్నారు. ఈ విషయమై వెటర్నరీ ఏడీఏ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

పన్నుల వసూళ్లకు స్పెషల్‌డ్రైవ్

ఖానాపూర్: పట్టణ పరిధిలో మున్సిపాలిటీకి రావాల్సిన పలు రకాల పన్నుల వసూళ్లకు కమిషనర్ రత్నాకర్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. పలువురు సిబ్బంది బృందాలుగా ఏర్పడి కాలనీలో ఇంటింటికీ వెళ్లి పన్నులను వసూలు చేశారు. ఈ నెల 31 లోగా ప్రజలు అన్ని పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

శాంతిభద్రతలను కాపాడేందుకే కవాతు


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ముధోల్: శాంతిభద్రతలను కాపాడేందుకే మండల కేంద్రంలో కవాతు నిర్వహిస్తున్నట్లు ముధోల్ సీఐ వినోద్ అన్నారు. ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన వీధుల గుండా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది, పోలీసులు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ వినోద్ మాట్లాడుతూ గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతిభద్రతలకు సహకరించాలని కోరారు. ముధోల్ ఎస్సై తిరుపతి, పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఉన్నారు.

రంజాన్ పండుగకు ఏర్పాట్లు

ఖానాపూర్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ముస్లిం మైనార్టీలు ఉండే పలు కాలనీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఆయా కాలనీలతోపాటు పట్టణంలోని మసీదు ప్రాంతాల్లో శానిటేషన్ పనులను ప్రారంభించామన్నారు. ఉదయం 3 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ కోతల్లేకుండా చూడాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

తపస్ నాయకుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

భైంసాటౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి గెలుపుపై తపస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈమేరకు ఆదివారం పట్టణంలో తపస్ ఆధ్వర్యంలో మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, గౌరవ అధ్యక్షుడు రాజేశ్వర్, దత్తురాం, చంద్రప్రకాశ్ తదితరులు ఉన్నారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి

నిర్మల్: విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరే వరకు విశ్రమించవద్దని వ్యక్తిత్వ వికాస శిక్షకులు రాజేందర్ అన్నారు. నిర్మల్‌లోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఉద్యోగం సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. అధ్యాపకులు అందరికీ ఒకే రీతిలో బోధిస్తారని, స్వీకరించడంపైనే విజయం ఆధారపడి ఉంటుందని వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భీంరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ మురళి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి, సెక్రెటరీ సర్వోత్తంరెడ్డి, ప్రిన్సిపాల్ అఖిలేశ్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ పూజలు


పూజలు చేస్తున్న మాజీ ఎంపీ రమేశ్

పెంబి: మండలంలోని ఎంగ్లాపూర్ అటవీ ప్రాంతంలో కొలువుదీరిన ఆదివాసీ, నాయక్‌పోడ్‌ల ఆరాధ్యదైవం మాడలదేవి తల్లి వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ హాజరై పూజలు చేశారు. అనంతరం ఆదివాసీలతో భోజనం చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు సదాశివ్, రామేశ్వర్ రెడ్డి, రామ్‌సింగ్, పెద్దయ్య, సదాశివ్, ఎల్లయ్య, వినోద్, తదితరులు ఉన్నారు.

అంతర్గత రోడ్లకు మహర్దశ

- లక్ష్మణచాంద మండలంలో రూ.3.28 కోట్లతో పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు
- ఈనెల25లోగా పూర్తి చేయాలని అధికారుల ఆదేశం


రాచాపూర్‌లో నూతనంగా వేసిన సీసీ రోడ్డు

పక్కన చిత్రంలో కన్పిస్తున్న నూతన సీసీ రోడ్డు మండలంలోని రాచాపూర్ గ్రామ బస్టాండ్ సమీపంలోనిది. గతంలో ఈ రోడ్డు సక్రమంగా లేక వైకుంఠధామం వద్దకు వెళ్లేందుకు గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. కాని ఇటీవల సీసీ రోడ్డు వేయడంతో వైకుంఠధామం వెళ్లేందుకు ఇబ్బందులు తొలగిపోయాయని రాచాపూర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలా మండలంలోని గ్రామాల్లో సీసీ రోడ్లు వేస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పలు గ్రామాల్లో గతంలో అంతర్గత రోడ్లు కంకర తేలి ఉండటంతో రాకపోకలు సాగించేందుకు గ్రామస్తులు ఇబ్బంది పడేవారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మంజూరైన నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తుండటంతో తమ కష్టాలు దూరం అవుతాయని మండలవాసులు పేర్కొంటున్నారు.

రూ.3.28 కోట్లతో సీసీ రోడ్లు..

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండలంలోని ఆయా గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మించేందుకు రూ.3 కోట్ల 28 లక్షలు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. మొదటి విడతలో రూ.1 కోటి 88 లక్షలు మంజూరవగా.. రెండు, మూ డు దశల్లో రూ.1 కోటి 40 లక్షలు మంజూరయ్యాయి.

ముమ్మరంగా పనులు..

మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మొదటి విడతలో ప్రారంభించిన పనులు.. ఇప్పటికే పూర్తవగా రెండో విడతలో ప్రారంభించిన పనులు కొనసాగుతున్నాయి. వడ్యాల్‌లో రూ.20 లక్షలతో పనులు పూర్తవగా మరో రూ.30 లక్షల విలువైన పనులు కొనసాగుతున్నాయి. రాచాపూర్‌లో రూ.10 లక్షల విలువైన పనులు పూర్తవగా.. మరో రూ.10 లక్షల పనులు ప్రారంభమయ్యాయి.

25 తుది గడువు..

మండలంలో ఆయా గ్రామాల్లో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఈనెల 25 వరకు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో ఆయా గ్రామాల్లో పనులు సకాలంలో పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు, క్షేత్రస్థాయి సిబ్బంది అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు.

గ్రామం	మంజూరైన నిధులు
పొట్టపెల్లి(కే)	రూ.10 లక్షలు
కనకాపూర్	రూ.20 లక్షలు
వడ్యాల్	రూ.50 లక్షలు
రాచాపూర్	రూ.20 లక్షలు
బాబాపూర్	రూ.10 లక్షలు
తిర్పెల్లి	రూ.30 లక్షలు
లక్ష్మణచాంద	రూ.30 లక్షలు
చామన్‌పెల్లి	రూ.25 లక్షలు
చింతల్‌చాంద	రూ.30 లక్షలు
మల్లాపూర్	రూ.20 లక్షలు
మాచాపూర్	రూ.5 లక్షలు
పార్‌పెల్లి	రూ.20 లక్షలు
ధర్మారం	రూ.10 లక్షలు
పీచర	రూ.35 లక్షలు
వడ్యాల్‌తండా	రూ.13 లక్షలు

గతంలో ఇబ్బంది ఉండే



గతంలో మండలంలోని పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు కంకర తేలి ఉండటంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడ్డాం. ప్రస్తుతం చేపడుతున్న సీసీ రోడ్డు పనులతో ప్రజల ఇబ్బందులు తొలగిపోతున్నాయి. – రాజేశ్వర్, చామన్‌పెల్లి

సీసీ రోడ్లకు మహర్దశ



ఉపాధిహామీ నిధులు మంజూరవడంతో మండలంలోని గ్రామాల్లో సీసీ రోడ్ల పనులు వేగంగా సాగుతున్నాయి. దీంతో అంతర్గత రోడ్లు అద్దంలాగా తయారవుతున్నాయి. – మహేశ్, రాచాపూర్

25లోగా పూర్తి చేయాలి



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో చేపడుతున్న సీసీ రోడ్ల పనులు ఈనెల 25వ తేదీలోగా పూర్తి చేయాలి. ఇప్పటికే సర్పంచ్‌లకు తెలిపాం. గ్రామాల్లో పర్యటిస్తూ సకాలంలో పనులు పూర్తి చేయాలని సూచిస్తున్నాం. –మోహన్, ఎంపీడీవో, లక్ష్మణచాంద

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : కబ్జ
నారాయణ: బలగం

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


నర్సాపూర్(జి): ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న భక్తులు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని శ్రీ రామాలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితులు రాజశేఖర్‌శర్మ, నరహరిశర్మ, సంతోశ్‌శర్మ, రతన్‌శర్మ మంత్రోచ్ఛరణల నడుమ శాంతిపాఠం, కర్మాణ పుణ్యాహవచనం, పూజలహోవనం, ధాన్యాది, ఫల, పుష్పాది వాసములు, జయాది హోమం తదితర పూజలు నిర్వహించి ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం దాత అనిల్‌కుమార్ రెడ్డిని సన్మానించారు. సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ గంగారెడ్డి, మహేశ్, వార్డు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. రైతులకు నష్టం

- తడిసిన పసుపు, నెలకొరిగిన మొక్కజొన్న
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


పెంబి: నేలకొరిగిన పంటను చూపిస్తున్న రైతు


కొట్టుకుపోయిన వంతెన వద్ద డీఆర్డీవో విజయలక్ష్మి

పెంబి: మండలంలో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి ఉడకబెట్టిన పసుపు తడిసిపోగా.. మొక్కజొన్న పంట నేలకొరిగింది. మందపల్లికి చెందిన మట్ట రాజబాబు అనే రైతు అర ఎకరంలో మొక్కజొన్న పంట వేయగా వర్షానికి పూర్తిగా నెలకొరిగింది. దీంతో పెట్టుబడి నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు.

కొట్టుకుపోయిన వంతెన పరిశీలన

పెంబి మండలంలో యాపలగూడ పరిధిలో దొత్తివాగుపై ఉన్న తాత్కాలిక వంతెన వర్షానికి కొట్టుకుపోగా.. ఆదివారం డీఆర్డీవో విజయలక్ష్మి, సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం ట్రాక్టర్లతో మొరం పోయించి తిరుగు ప్రయాణమయ్యారు. అంతకుముందు షెట్‌పల్లిలో విధులకు వెళ్తుండగా బైక్‌పై నుంచి పడిన ఫీల్డ్ అసిస్టెంట్ తోడసం భీంరావును ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. శనివారం రాత్రి దోందారి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో బస చేశారు. వారి వెంట టీఏ అంజయ్య, ఎఫ్ఏలు భూమన్న, గోపి, తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని సూర్యాపూర్, ఓలా, అంబకంటి, దౌనెల్లి, వెంకూర్, కుంటాల గ్రామాల్లో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గ్రామాల్లో కోతకు వచ్చిన మొక్కజొన్న పంట నేలకొరిగింది.

చెట్లు తొలగింపు

కడెం: మండలంలోని రాంపూర్ గ్రామ సమీపంలో గండి మైసమ్మ ఆలయ పరిసరాల్లో శనివారం రాత్రి ఈదురుగాలులకు భారీ వృక్షాలు రోడ్డుపై పడటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆదివారం ఉదయం ఎస్సై రాజు పొక్లెయిన్‌తో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

సామగ్రి అందజేత

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 28న అఖండ హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమానికి మంత్రి ఐకేరెడ్డి పీఏ కృష్ణంరాజు క్వింటాలు బియ్యంతో పాటు వంట సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కృష్ణంరాజును శాలువాతో సన్మానించారు. శ్రీనివాస్, రాజేశ్వర్, రమేశ్, కృష్ణ, రాకేశ్, హరీశ్, దివాకర్ ఉన్నారు.

పండ్లు అందజేత

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఇంద్రనగర్‌లో తన నివాసంలో నిర్మల్ జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు పాకాల రాంచందర్ దంపతులు ఉత్తరాఖండ్ ఓం శంకర్ ఆశ్రమం నుంచి వచ్చిన స్వామీజీలకు ఆదివారం పండ్లు, నగదు అందించారు. ఈ స్వామీజీలు లోక కల్యాణ యాత్ర కోసం ఉత్తరాఖండ్ నుంచి బయలుదేరారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్వామీజీలు మహంతి చింతగిరి, రాజు, సుశీల్ బాబా, జగదీశ్ ఉన్నారు.

ఘనంగా మండల పూజ

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ గుమ్ములవాడలో శ్రీలక్ష్మీనరసింహస్వామి మండల పూ జ ఘనంగా నిర్వహించారు. పండితులు విష్ణుబొట్ల రాజశేఖరశర్మ, ప్రవీణ్ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించి హనుమాన్ దీక్షాపరులకు అన్నదానం చేశారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

కడెం: రంజాన్ పండుగను పురస్కరించుకొని మండలంలోని మాసాయిపేట్ గ్రామంలో పలువురు నిరుపేద ముస్లిం కుటుంబాలకు మజీద్ కమిటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మజీద్ కమిటీ షేక్ అజీజ్, ఇమామ్ హఫీజ్, షబ్బీర్ తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ వార్షికోత్సవం

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామంలో ఎల్లమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. మహిళలు బోనాలతో వెళ్లి నైవేద్యం సమర్పించి.. మొక్కులు సమర్పించారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సర్పంచ్ ప్రదీప్‌కుమార్, ఎంపీటీసీ సుధాకర్, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామసంకీర్తన

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామంలో ఆదివారం హనుమాన్ దీక్షాపరులు గ్రామసంకీర్తన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గురుస్వామి రాజేశ్వర్ ఆధ్వర్యంలో గీతాలాపన, భజనలు చేపట్టారు. అనంతరం దీక్షాపరుడు శోభన్ బాబు ఆధ్వర్యంలో భిక్ష ఏర్పాటుచేశారు.

బుద్ధుడు చూపిన మార్గంలో నడవాలి

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి
- వడ్‌గాంలో 10వ ధమ్మ పరిషత్


అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి భూమిపూజ

తానూరు: ప్రతి ఒక్కరూ బుద్ధుడు చూపిన మార్గంలో నడవాలని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వడ్‌గాం గ్రామంలో 10వ ధమ్మ పరిషత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో అశోక చక్రవర్తి 80 వేల బుద్ధ మందిరాలను నిర్మించినట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహంతోపాటు బుద్ధుడి చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం పంచశీల్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బౌద్ధ భిక్షువులు సుబోధ్ థేరో, కమల్‌బోధి, ధమ్మబోధి ఎస్సీ ఫర్ ఎస్సీ రైట్స్ తాలూక అధ్యక్షుడు మైసేకర్ సాయిలు, భారతీయ బౌద్ధమహాసభ నాయకులు ప్రభాకర్ గడపాలే, నారయణ్, మద్‌నురే, న్యాయవాది శకుంతల, సమతసైనిక్‌దళ్ జిల్లా ఉపాధ్యక్షుడు దిగంబర్, భైంసా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, కోఆప్షన్ సభ్యుడు గోవింద్‌రావ్ ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని ఖథ్‌గాం గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామానికి బీటీ రోడ్డు, కల్యాణ మండపం మంజూరు చేస్తానన్నారు. గ్రామాభివృద్ధికి యువత తోడ్పాటు అందించాలన్నారు. మండల ఉపాధ్యక్షులు గంగాధర్, సర్పంచ్ రాజు, లింగా సర్పంచ్ గణేశ్, ఎంపీటీసీ మాణిక్, గజానంద్, పోతన్న, మారుతి, తదితరులు ఉన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం

లక్ష్మణచాంద: మండలంలోని పీచర, ధర్మారం, మల్లాపూర్ గ్రామాల విశ్వబ్రాహ్మణసంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధర్మారంలో మూడు గ్రామాల విశ్వబ్రాహ్మణ సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించగా అధ్యక్షుడిగా గజ్జెల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా రాజేశ్వర్, కోశాధికారిగా లింబాద్రి, కార్యవర్గ సభ్యులుగా రమేశ్, ఉదయ్, ఆనంద్‌ను ఎన్నుకున్నారు.

ఎన్‌టీఆర్ మార్గ్ కార్యవర్గం

నిర్మల్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ ఎన్‌టీఆర్ మార్గ్ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన ఎన్నికలో అధ్యక్షుడిగా భూసారపు గంగాధర్ రెండోసారి, ప్రధాన కార్యదర్శిగా శివరాం వెంకటేశ్, కోశాధికారిగా చిట్టిమల్ల సదయ్య, గౌరవ అధ్యక్షులుగా ఎర్రవోతు సురేందర్, లింగంపల్లి లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా మిట్టపల్లి నర్సయ్య, తోడిశెట్టి పరమేశ్వర్, కందురి శంకర్, శంకర్ వ్యవహరించారు.

పోస్టర్ ఆవిష్కరణ

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో ఆదివారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జనచైతన్య యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను స్థానిక నాయకులు ఆవిష్కరించారు. నిర్మల్‌లో ఈనెల 24న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. స్థానిక నాయకులు దుప్పి సాయన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయరూ



తానూరు: తానూరు ఎక్స్‌రోడ్డు నుంచి దౌలతాబాద్‌కు వెళ్లే మార్గంలో వంతెన మలుపు వద్ద హెచ్చరిక బోర్డు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని.. వెంటనే సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్: 90100 53882

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


బాదనకుర్తిలో ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని బాదనకుర్తి గ్రామంలో నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బోయ సంఘం, మున్నూరు కాపు సంఘం భవనాలకు సంబంధించిన రూ.రెండు లక్షల చొప్పున ప్రొసీడింగ్ కాపీలను సభ్యులకు అందజేశారు. అంతకుముందు సుర్జాపూర్‌లో యాదవ సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎర్వచింతల్‌లో యూఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఓ దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేశారు. అనంతరం పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద సెర్ప్ ఉద్యోగులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శివాజీనగర్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు సురేశ్ పెద్దమ్మ మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న రమేశ్‌ను పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో పార్శపు శ్రీనివాస్, శనిగారపు రాణి, శ్రావణ్, పుప్పాల శంకర్, రాజగంగన్న, ప్రదీప్, వెంకాగౌడ్, అంకం రాజేందర్, పరిమి సురేశ్, నవీన్, బుచ్చాగౌడ్, స్వామి, సురేశ్, రాజు, రాజన్న, రాజేశ్వర్, స్వామి, రాజేశ్వర్, సంతోశ్, గోపాల్, సునంద, బీక్‌సింగ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

ఊరూరా సంఘాలు ఏర్పాటు చేయండి

లోకేశ్వరం: ఐకేపీ సభ్యులు ప్రతి గ్రామంలో ఉత్పత్తిదారు సంఘాలను ఏర్పాటు చేయాలని లోకేశ్వరం ఏపీఎం మల్లేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని రాయపూర్‌కాండ్లీలో ఐకేపీ సభ్యులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏర్పాటు చేసే ఉత్పత్తిదారుల సంఘంలో కనీసం వెయ్యి మంది సభ్యులు ఉండాలన్నారు. మండలంలో ఇప్పటివరకు 40 సంఘాలు ఏర్పాటు చేశామన్నారు. ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో ఆయా కంపెనీల ద్వారా గిడ్డంగులను నిర్మించడంతోపాటు విత్తనాలు, ఎరువులు రాయితీ కింద అందజేస్తారన్నారు. కార్యక్రమంలో సీఏలు సునీత, రమణారెడ్డి ఉన్నారు.

సన్నాహక సమావేశం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో వాలా అసోసియేషన్ సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసమావేశానికి వాలా అధ్యక్షుడు నాలం శ్రీనివాస్ అధ్యక్షతన వహించారు. ఈనెల 26న నిర్వహించే సర్వసభ్య సమావేశంలో సభ్యులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి భీమా సురేందర్, ఉపాధ్యక్షుడు సనుగుల దేవిదాస్, గౌరవ అధ్యక్షుడు మునిందర్‌రెడ్డి, ట్రెజరర్ శంకర్‌గౌడ్, ఎనగందుల రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని అర్లి గ్రామానికి చెందిన గొల్ల మల్లేశ్‌కు రూ.లక్ష విలువైన చెక్కు మంజూరైంది. ఆదివారం ఎంపీటీసీ దత్తురాం పటేల్ లబ్ధిదారు కుటుంబ సభ్యులకు వారి ఇంటి వద్ద చెక్కు అందజేశారు. కార్యక్రమంలో భోజారాం పటేల్, ఆనంద్‌రావు, కిరణ్‌పటేల్, వినోద్, రాజేందర్‌రెడ్డి ఉన్నారు.